క్లుప్తంగా

సన్మానం

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని గడి పెద్దాపూర్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం సమ్మన్ దివస్ కార్యక్రమం పురస్కరించుకొని బ్యాంకులో అకౌంట్ ఉన్న సీనియర్ పెన్షనర్‌లను మేనేజర్ ప్రఖ్యాత్ సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంకు డిపాజిట్‌దారులు, వినియోగదారులు రమేశ్, అలీహూసెన్, బ్రహ్మం, దుర్గారెడ్డి, సాయిలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివభక్తుల పాదయాత్ర

శివ్వంపేట,(నర్సాపూర్): మండలంలోని శివభక్తులు గురువారం శ్రీశైలంకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా శివభక్తులు మండల కేంద్రంలోని శివాలయంలో న్యాసపూర్వక రుద్రాభిషేకం, పంచామత అభిషేకం, గంధము, పసుపు, కుంకుమ, బిల్వ దళాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్రలో గురుస్వామి కొడకంచి గణేశ్‌గౌడ్, మీనాజీపేట కుమార్, ఆకుల కాశీ, దేవేందర్‌గౌడ్, ఇసుగారి నర్సింలు, రాజు, నాగరాజు, గణేశ్, సాయి, నర్సాపూర్ నుంచి సాయిరాం గౌడ్, వంశీ, లాల్లు తదితరులు ఉన్నారు.

దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న నాయకులు, అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని ఏదుల్లాపూర్ పురాతన ఏదుల్లా హుస్సేన్ దర్గాకు గురువారం మున్నురుకాపు రాష్ట్ర ఉపాధ్యాక్షుడు హన్మంతరావు చాదర్ సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, సర్పంచ్ కీర్తన, ఉప తహసీల్దార్ ప్రభుదాస్, ఆర్ఐ కిషన్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలకు ఊతమిచ్చేలా కేంద్ర బడ్జెట్

చేగుంట(తూప్రాన్): క్రీడలకు ఊతమిచ్చేలా కేంద్రం బడ్జెట్ కేటాయించడం హర్షనీయమని ఫెన్సింగ్, రగ్బీ, యోగా కోచ్ కరణం గణేశ్ రవి కుమార్ అన్నారు. చేగుంటలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. 2023–24 అర్థిక సంవత్సరం ఆటల కోసం బడ్జెట్‌ను కేటాయించి క్రీడలకు ఊతమిచ్చేలా చేశారని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీటీసీ శంభుని రవి బీజేపీ దుబ్బాక నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్, బీజేవైఎం కార్యదర్శి భానుప్రసాద్, కృష్ణ, సంతోశ్‌రెడ్డి, బాల్‌చందర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌కు వత్తాసుగా అధికారులు'

శివ్వంపేట(నర్సాపూర్): మండల అధికారులు బీఆర్ఎస్ నాయకులకు వత్తాసుగా పని చేస్తున్నారని బీజేపీ నాయకులు గురువారం ఆరోపించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవిగౌడ్ మాట్లాడుతూ.. మండలంలోని కొంతాన్‌పల్లి, సికింద్లాపూర్, నవాబ్ పేట్ గ్రామాల్లోని పార్ట్–బీలో ఉన్న భూములను బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన కొంతమంది నాయకులకు రిజిస్ట్రేషన్ చేస్తూ, కొత్త పాస్ పుస్తకాలు ఇస్తున్న రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి వారికి సంబంధించిన భూ సమస్యలు పరిష్కరించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మండల ప్రధాన కార్యదర్శి అశోక్ సాదుల, ఓబీసి మోర్చా జిల్లా కార్యదర్శి హరిగౌడ్, మండల ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు ఆంజనేయులు చారి, బిజిలీపూర్ బూత్ అధ్యక్షులు యాదగిరి, సాయి పాల్గొన్నారు.

రాయరావు చెరువు కట్టపై కోతుల వీరంగం

నర్సాపూర్ రూరల్: పట్టణంలోని రాయరావు చెరువుకట్టపై గురువారం సాయంత్రం కోతులు వీరంగం చేశాయి. కట్టపై ఉన్న పార్క్‌తో పాటు చిన్న పిల్లల ఆటలు ఆడేందుకు ఆయా పరికరాలు ఉండడంతో సాయంత్రం సమయంలో పిల్లలు, మహిళలు, వాకింగ్ చేసుకునేందుకు పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున వస్తారు. గురువారం రోజులాగే కట్టపైకి వచ్చి చిన్నపిల్లలు ఆడుతూ మరికొంతమంది వాకింగ్ చేస్తున్న సమయంలో కోతుల గుంపు పెద్ద ఎత్తున వచ్చి వీరంగం సృష్టించాయి. దీంతో పిల్లలు, పెద్దలు పరుగులు పెట్టారు. పరుగులు పెట్టే సమయంలో కోతులు కట్టపై ఉన్న గేటుపై ఉన్న బోర్డును ధ్వంసం చేయడంలో కొంత మంది ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

ఘనంగా తుంబులిశ్వరుడికి బండ్ల ఊరేగింపు

టేక్మాల్(మెదక్): మండలంలోని వేల్పుగొండ గ్రామంలోని శ్రీ తుంబురీశ్వర స్వామివారి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తుంభూరీశ్వర దేవాలయంలోని దేవతామూర్తులకు రుద్రా అభిషేకం, వ్యూహ వచనం, కలశ స్థాపన, శకట ఉత్సవం, సాయంత్రం బండ్ల ఊరేగిహించారు. ఇందులో ఆలయ అర్చకుడు రవి కోటి వైద్య రామశర్మ, సర్పంచ్ నారాయణ ఉపసర్పంచ్ ప్రేమ్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో అడ్మిషన్లు

- విడుదలైన నోటిఫికేషన్
- ఈనెల 15వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- చదువుతో పాటూ క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ
- టేక్మాల్ మోడల్ స్కూల్‌కు ఆసక్తి చూపుతున్న విద్యార్థులు


టేక్మాల్ మోడల్ స్కూల్

టేక్మాల్(మెదక్): నిరుపేద విద్యార్థులకు మోడల్ స్కూల్ వరంగా మారింది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సకల వసతులతో విద్యా భోదన చేస్తున్న మోడల్ స్కూళ్లలో దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతోంది. 2023 – 2024 సంవత్సరానికి గానూ మోడల్ స్కూలల్లో సీట్ల భర్తీ కోసం ప్రస్తుతం నోటిఫికేషన్ విడుదలైంది. మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతిలో ఖాళీ ఉన్న సీట్ల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీ వరకు తుది గడువు ఉన్నది. నూతనంగా చేరేందుకు 6వ తరగతి విద్యార్థులకు 100 సీట్లకు గానూ, 8 – 10 తరగతులకు ఖాళీగా ఉన్నా.. సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

- మండల కేంద్రం టేక్మాల్ మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి ప్రతీ ఏడాది విద్యార్థుల నుంచి తీవ్రమైన పోటీ ఉంటుంది.
- ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన బోధన ఉంటుంది. పదో తరగతి ఫలితాల్లో ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తుండడంతో పాటూ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.
- నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌ల కోసం ప్రత్యేకంగా విద్యార్థులను ప్రిపేర్ చేయడంతో పదుల కొంది విద్యార్థులు ఎంపికవుతున్నారు.
- గతేడాది పదోతరగతిలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు.
- దీంతో సీట్ల సంఖ్యకు రెట్టింపు దరఖాస్తులు వస్తున్నాయి.
- టేక్మాల్ మండలంలోని వారే కాకుండా చుట్టూ ఉన్నా ఇతర మండలంలోని విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవడం విశేషం.
- అయితే ఖాళీల భర్తీలో మొదట సొంత మండలానికి చెందిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తు తప్పనిసరి..

- మోడల్ పాఠశాలకు విద్యార్థులు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమేhttp://telangana.-cgg.gov.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- దరఖాస్తు కోసం ప్రస్తుతం వారు చదువుతున్న పాఠశాల నుంచి బోనోఫెడ్, ఆధార్‌కార్డు, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో మీ సేవా కేంద్రంలో గాని ఇంటర్నెట్ సెంటర్‌లో గాని దరఖాస్తు చేసుకోవచ్చు.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రూ.125, ఇతరులకు రూ.200 ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాన్ని ఏ పాఠశాలలో ప్రవేశం కోరుతున్నామో ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌కు అందజేయాలి. ప్రతీ తరగతిలో 15శాతం ఎస్సీలకు, 6 శాతం ఎస్టీలకు 29శాతం బీసీలకు, దివ్యాంగులకు 9 శాతం, బాలికలకు 33 శాతం సీట్లు కేటాయిస్తారు.

విద్యార్థులకు పరీక్ష నిర్వహణ ఇలా..

- దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 8వ నుంచి ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లను డైన్‌లోడ్ చేసుకోవాలి.
- ఏప్రిల్ 16న అన్ని తగరతుల విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.
- మే 5న ఫలితాలు ప్రకటిస్తారని, ఎంపికైన విద్యార్థులకు మే 20న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు.
- జూన్ 1న తరగతులు ప్రారంభమవుతాయి.

నాణ్యమైన బోధన అందిస్తాం..



మోడల్ స్కూల్‌లో ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన బోధనను అందిస్తున్నాం. చదువాలనే ప్రతీ విద్యార్థి కచ్ఛితంగా దరఖాస్తు చేసుకొని, పరీక్ష రాయాలి. ఐదేళ్లుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. పాఠశాలలో అన్ని రకాల వసతులు ఉన్నాయి.

– కరుణాకర్‌రెడ్డి,
మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, టేక్మాల్

రుణాలపై అవగాహన


కళాజాత బృందంతో బ్యాంకు మేనేజర్ ఇతర సిబ్బంది

నర్సాపూర్: డీసీసీబీ నర్సాపూర్ శాఖ ఆధ్వర్యంలో గురువారం కళాజాత ఆధ్వర్యంలో బ్యాంకు ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న రుణాలపై అవగాహన కల్పించారు. కళాజాత ప్రదర్శనను పట్టణంలోని శ్రీనల్లపోచమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. స్థానిక డీసీసీబీ శాఖ మేనేజర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ కృపాకర్‌రావుల ఆధ్వర్యంలో కళాజాత కళాకారులు పాటలు పాడుతూ.. నృత్యాలు చేస్తూ బ్యాంకులో ఖాతాదారులకు రుణాలపై అవగాహన కల్పించారు. పాడిపరిశ్రమకు, పౌల్ట్రీ, హౌసింగ్ తదితర రకాల రుణాలు, బంగారు ఆభరణాలపై అందుబాటులో రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు విజయలక్ష్మి, కృపాకర్‌రావు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది మహేష్, ప్రశాంత్, పీఏసీఎస్ సీఈఓ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత


చెక్కును అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీపీ శ్రీనివాస్ పర్యటించి, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. పోతాన్‌శెట్టిపల్లి గ్రామంతో పాటు ఇబ్రహీంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన బోర్ మోటార్లను ప్రారంభించారు. పోతాన్‌శెట్టిపల్లిలో మోమన్‌కు మంజూరైన 21 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, సర్పంచ్‌లు నెల్లూరు, రాములు, ఆయా గ్రామాల టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'9, 10 తరగతులకు విద్యాబోధన చెయ్యం'

భాషా పండితులు


వినతిపత్రం ఇస్తున్న భాషా పండితులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): తమకు ఉన్న జాబ్ చాట్ ప్రకారం 9, 10 తరగతులకు విద్యాబోధన చెయ్యమని భాషా పండితులు అన్నారు. గురువారం మండలంలోని ఫైజాబాద్ ఉన్నత పాఠశాలలో భాషా పండితులుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు 9, 10 తరగతులకు సహాయనిరాకరణ చేస్తున్నామని హెచ్ఎం తారాసింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భాషా పండితుల జాక్ పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. తమకు ఉన్న జాబ్ చాట్ ప్రకారం 6, 7, 8 తరగతులకు మాత్రమే బోధించాలని, అయిన తమల్ని 9, 10 తరగతులకు సైతం బోధిస్తున్నరన్నారు. అలా తాము విధులు నిర్వర్తిస్తున్న, అన్ని అర్హతలు ఉన్న, తమల్ని ఉన్నతీకరణ చేయకపోవడంపై ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాషా పండితులు స్నేహలత, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా రాజు యాదవ్

చిన్నశంకరంపేట(మెదక్): బీజేపీ మండల శాఖలో మరో నలుగురికి చోటు కల్పించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు పట్లోరి పోగురాజు ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా రాజు యాదవ్(సంగాయిపల్లి), బుర్క దాసు(చందంపేట)లను నియమించినట్లు తెలిపారు. అలాగే బీజేపీ మండల కార్యదర్శులుగా పరశురామ్, కుమార్, కోశాధికారిగా పట్లోరి రామ్‌నరేశ్‌లను నియమించినట్లు తెలిపారు.

వైద్య శిబిరం

రామాయంపేట(మెదక్): రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో గురువారం రామాయంపేటలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరాన్ని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన సురక్ష కంటి ఆస్పత్రి వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈశిబిరంలో 112 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్, ఎస్ఐ రంజిత్, సంఘం మండలాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, జిల్లా నాయకులు నర్సింహారావు, నాగేందర్, రషీద్, శేఖర్ పాల్గొన్నారు.

దేవునికుంట కట్ట కబ్జాపై అధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..


ఇరిగేషన్ అధికారికి ఫిర్యాదు పత్రం ఇస్తున్న ఇన్‌చార్జ్ సర్పంచ్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో గ్రామంలోని దేవునికుంట కట్టను ధ్వంసం చేస్తూ గ్రామస్తులు కబ్జాలు చేయడంపై ఇరిగేషన్ అధికారులు స్పందించి, విచారణ చేపట్టారు. గురువారం 'సాక్షి' దినపత్రికలో 'కుంట కట్ట కబ్జాపై ఫిర్యాదు' వార్తకు ఇరిగేషన్ అధికారులు స్పందించి ఐబీ డిప్యూటీ ఈఈ జగన్నాథం ఆదేశాలతో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ బాగయ్య గ్రామానికి వచ్చి విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి దేవునికుంట కట్టను ధ్వంసం చేయడంపై గ్రామ సభను నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

◆ అంబాజీపేట సర్పంచ్‌కు నోటీస్‌లు

చిన్నశంకరంపేట(మెదక్): పల్లెప్రగతి పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మండలంలోని అంబాజీపేట గ్రామ సర్పంచ్ సాయిలుకు నోటీస్‌లు అందించినట్లు ఎంపీఓ గిరిధర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేయాల్సిన హరిత నర్సరీని ప్రారంభిచకపోవడంతో పాటు గ్రామంలో పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న సర్పంచ్‌కు నోటీస్‌లు అందించినట్లు తెలిపారు.

◆ రుణాలపై అవగాహన

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావ్‌పేటలో డీసీసీబీ రుణాలపై కళాజాత ప్రదర్శన ద్వారా గ్రామస్తులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీసీబీ మేనేజర్ ప్రద్యుమ్నరెడ్డి మాట్లాడుతూ.. డీసీసీబీలో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించడం వల్ల రాయితీ వర్తిస్తుందని తెలిపారు. రుణాలు చెల్లించకపోవడంవల్ల వడ్డీతో పాటు అపరాధరుసుం వసూలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నజియాసలీం, ఎంపీటీసీ సాజిదపాషా, సూపర్‌వైజర్ నరేశ్, శ్రీమాన్ గ్రామస్తులు, రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

◆ ఇళ్ల స్థలాలకు హద్దులకు సర్వే పనులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గౌతోజీగూడెం గ్రామస్తులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లకు ఎట్టకేలకు పై అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో ఇళ్ల ప్లాట్లకు హద్దులు వేసే పనులకు అధికారులు సర్వే పనులను గురువారం చేపట్టారు. గ్రామంలోని సర్వేనంబర్ 457లో 74 మంది లబ్ధిదారులకు ఇచ్చిన ఇంటి స్థలాలకు పోజిషన్‌కు హద్దుల ఏర్పాటు పనులను చేపట్టినట్లు సర్వే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ పంచమి రేణుకుమార్, సర్వేయర్ బాలు, కార్యదర్శి నందిని, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ ముగిసిన గురుకుల ఉపాధ్యాయుల శిక్షణ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల పదవ తరగతి ప్రశ్న పత్రం మార్పుపై ఉపాధ్యాయులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎంజేపీబీసీ గురుకులాల ఆర్‌సీఓ ప్రభాకర్ మాట్లాడుతూ.. శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎంజేపీ గురుకుల పాఠశాలకు చెందిన భౌతిక, జీవశాస్త్రం, గణితం ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివప్రసాద్, రూపదేవి, సంతోషి, సలోమి, ఏటీపీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

◆ బడ్జెట్‌లో కొత్త మండలాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

మెదక్‌జోన్: త్వరలో ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో కొత్త మండలాలకు ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మెదక్ నియోజకవర్గంలోని హవేళిఘనపూర్, నిజాంపేట, నార్సింగ్ కొత్త మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు లేక అద్దె భవనాల్లో ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

◆ సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

టేక్మాల్(మెదక్): బంజార గిరిజనుల ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని వెంకటాపూర్ ఉపసర్పంచ్ పాత్‌లోత్ రమేశ్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన టేక్మాల్‌లో మాట్లాడుతూ... సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

◆ చెక్ డ్యాంకు మరమ్మతులకు భూమిపూజ

తూప్రాన్: మండలంలోని యావపూర్ గ్రామ సమీపంలో హల్దీవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం మరమ్మతులకు గురువారం సర్పంచ్ నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు పూజలు చేశారు. ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

◆ స్వామివారి ఊరేగింపుతో బ్రహ్మోత్సవాల ముగింపు

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో గురువారం స్వామివారి ఊరేగింపుతో వెంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సావాలను ముగించారు. కార్యక్రమంలో ధర్మకర్త కిషన్‌రావు, సర్పంచ్ రాములు, నాగభూషణం పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ప్రతిష్ఠ ఉత్సవాలు


కౌడిపల్లి(నర్సాపూర్): కుంకుమార్చన చేస్తున్న మహిళలు


పెద్దశంకరంపేట(మెదక్): హోమం నిర్వహిస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేటలో శ్రీఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రెండో రోజు ఆలయం వద్ద గ్రామ పురోహితుడు యమవరం బాపుశర్మ సమక్షంలో అర్చకులు రాజశేఖర్‌శర్మ, రవితేజశర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చన, హోం చేశారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నందున దేవతామూర్తుల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. దీంతో పాటు హైందవ ధర్మ సేవారత్న చిలుకూరు శివాలయం ప్రధాన అర్చకుడు సురేశ్ ఆత్మరాం మహారాజ్ రామదాసి ఆధ్వర్యంలో శివస్వాములు, హనుమాన్ భక్తులు, గ్రామస్తులు గ్రామంలో పర్యటించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగంగౌడ్, ఉపసర్పంచ్ మాధవిశివ, సొసైటీ డైరెక్టర్ మల్లేశం, విగ్రహ దాత భర్మ నాగమణిమల్లేశ్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

కోలపల్లిలో..

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కోలపల్లి గ్రామంలో శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ బుధవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండో రోజు గురువారం ఆలయ ఆవరణలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య గణపతి హోమం, పుణ్యావచన అఖండ దీపాస్థాపన, జలాధివాసం, హారతి, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం పలు కార్యక్రమాలతో పాటు శనివారం పునర్నిర్మిత హనుమాన్ ఆలయంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠతో పాటు నవగ్రహ, శివ పంచాయతన ప్రతిష్ఠ చేస్తామని, ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

వైభవంగా రామలింగేశ్వరాలయ వార్షికోత్సవం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రమైన టేక్మాల్ గుట్టపై వెలసిన రామలింగేశ్వరాలయ వార్షికోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు నాగరాజు స్వామి గణపతిపూజ, గౌరీపూజ, రుద్రాభిషేకం నిర్వహించారు.

కాశీ విశ్వేరాలయంలో..

మండలంలోని దనూరలోని కాశీవిశ్వేరాలయ వార్షికోత్సవంలో భాగంగా గోపూజ, రుద్రాభిషేకం, రుద్రహోమం, శివపార్వతుల కల్యాణం, ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ నిర్వహించారు. పడిపూజలో శివస్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా డాంబర్ ప్లాంట్

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి వినతి


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

మెదక్ మున్సిపాలిటీ: నిబంధనలకు విరుద్ధంగా తమ వార్డుల పరిధిలో డాంబర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని పట్టణంలోని అవుసులపల్లి 2, 3 వార్డుల ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. గురువారం మెదక్‌లోని క్యాంపు కార్యాలయంలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి 'మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అవుసులపల్లి 2, 3 వార్డుల ప్రజలు తమ వార్డుల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న డాంబర్ ప్లాంట్‌ను వెంటనే తొలగించాలని ఫిర్యాదు చేశారు. 13వ వార్డులోని ప్రజలు వారికి శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కౌన్సిలర్ సులోచన ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కమిషనర్ జానకి రామ్‌సాగర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హవేళిఘనపూర్ మండలానికి చెందిన 105 మందికి, పట్టణానికి చెందిన 6 మందికి మొత్తం 111 లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు యం.లావణ్య రెడ్డి, మెదక్ ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పంటలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి


రామాయంపేట(మెదక్): పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ

రామాయంపేట(మెదక్): వరి పంటలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ సూచించారు. ఆయన గురువారం పట్టణ శివారులో తెగులు సోకిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరిలో పలు రకాల కాండం తొలుచు పురుగులతో పాటు రెక్క రాల్చు పురుగు, లద్దె పురుగులు ఆకుల చివరి అంచులను తినేయడం వల్ల మొక్క ఎర్రబారి పెరుగుదల లేక చరిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వీటిని ప్రాథమిక దశలోనే గుర్తించి, తమ దృష్టికి తీసుకెళ్లి క్రిమిసంహకర మందు పిచికారీ చేస్తే తెగులును సమర్థవంతంగా అరికట్టవచ్చని సూచించారు. తెగులు నివారణకు ముందుగా తక్కువ తీవ్రత గల పురుగు మందులను మాత్రమే పిచికారీ చేయాలన్నారు. అధిక తీవ్రత మందులను వాడితే, పురుగులకు మందును తట్టుకునే రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఎక్కువ మోతాదులో క్రిమి సంహారక మందులు వాడితే మంచిది కాదని హెచ్చరించారు. అలాగే పంటచేలలో ఎకరాకు పది చొప్పున లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. వ్యవసాయ క్షేత్రాల్లో రైతులు రాత్రివేళ రిచార్జ్ బల్బులు లేదా సోలార్ లైట్లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

టేక్మాల్(మెదక్): మండలంలోని మల్కాపూర్ గ్రామంలో గురువారం పెద్దశంకరంపేట ఏడీఏ రాంప్రసాద్ వరి క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాతావరణంలో ఆకస్మిక మార్పులు, రెండు సీజనల్ పంటల మధ్య విరామం లేకపోవడం, వానకాలం నుంచి యాసంగి సీజన్ వరకు పురుగుల బెడదతో వరికి తెగుళ్లు సోకుతున్నట్లు తెలిపారు. ఒక సీజన్‌కు మరో సీజన్‌కు కనీసం ఒక నెల విరామం ఇవ్వాలని తెలిపారు. వానకాలం పంట కోసిన కొద్ది రోజులకే రైతులు వరి సాగు చేస్తే తెగుళ్లకు గురికావాల్సి వస్తుందన్నారు. తెగుళ్ల సమస్యను అధిగ మించడానికి ఎకరానికి 400 ఎంఎల్ క్లోరిపారిపాస్, 3గుళికలు కార్బోఫ్యూరాన్ వేయాలని సూచించారు. ఇందులో ఏఈఓ ఇంద్రయ్య తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం


కౌడిపల్లి(నర్సాపూర్): అద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహ్మద్‌నగర్‌లో కంటి వెలుగు వైద్యశిబిరాన్ని ఎంపీపీ రాజు నాయక్, జెడ్పీటీసీ కవిత అమర్‌సింగ్ గురువారం ప్రారంభించారు. సర్పంచ్ దివ్యమహిపాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కంటి వెలుగును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందని, 18 ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరు పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఉచితంగా వైద్యం చేసి మందులు, అద్దాలు పంపిణీ చేస్తున్నారని గ్రామస్తులు వైద్యసిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రామాగౌడ్, ఎంపీటీసీ సునీతకృష్ణ, ఉపసర్పంచ్ ఫారుక్, ఏఎన్ఎంలు రాజమణి, మజీదబేగం, తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వినోదరెడ్డి, ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. గురువారం వారు మండల పరిధిలోని బద్యా తండాలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుజ్జిబాయి, కార్యదర్శి మోహన్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తూప్రాన్: ప్రజలకు దృష్టి లోపాల నివారణ కోసమే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని ఎంపీపీ స్వప్న అన్నారు. గురువారం మండలంలోని వట్టూరు గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్ రూరల్: కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ సాయిబాబా సూచించారు. గురువారం హవేళిఘనపూర్ మండలం తొగిట గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, వైద్య సిబ్బంది ఉన్నారు.